సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 22 । ఏప్రిల్ । 2023



ముస్తాబైన ఈద్గాలు

నేడు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకునేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. ఈద్గాలను సుందరంగా తీర్చిదిద్దారు. IIలో



108 మందికి అసైన్డ్ పట్టాలు

కరకగూడెం మండలంలో 108 మంది గిరిజనులకు కలెక్టర్ అనుదీప్, విప్ రేగా కాంతారావు పట్టాలు అందజేశారు. IIలో

గరిష్టం / కనిష్టం
39° / 24°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రత కొంతమేర తగ్గుతుంది. అక్కడక్కడా ఈదురు గాలులతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆలనా.. పాలన !

- కుమార్తెను చూసుకుంటూనే ఎమ్మెల్యే హరిప్రియ విధులు



కుమార్తెను లాలిస్తూనే దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందు: ఆరు నెలల పాపను లాలిస్తూనే ఎమ్మెల్యేగా తన బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు ఎమ్మెల్యే హరిప్రియ. వివిధ పనుల నిమిత్తం ఇల్లెందులోని క్యాంపు కార్యాలయానికి శుక్రవారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చారు. ఈ క్రమంలో హరిప్రియ తన కుమార్తె రుద్రభారతీ ప్రియను లాలిస్తూనే ప్రజల సమస్యలు తెలుసుకుని వినతిపత్రాలు స్వీకరించారు. అంతేకాక షాదీముబారక్, కల్యాణలక్ష్మి దరఖాస్తులు, ఇతర ఫైళ్లపై సంతకాలు చేస్తూ కనిపించారు.

రామయ్యకు స్వర్ణ కవచాలంకరణ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీతాయారమ్మ వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు గావించారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం

పాల్వంచరూరల్ : మండలంలో కొలువుదీరిన పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం వైభవంగా పంచామృతంతో అభిషేకం చేశారు. ముందుగా మేళతాళాలతో అమ్మవారి జన్మస్థలం వద్ద అర్చకులు పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం అమ్మవారికి అభిషేకం, నివేదన, పంచహారతులు, నీరాజన మంత్రపుష్పం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు పద్మనాభశర్మ, పురాణం రవికుమార్‌శర్మ, దుర్గాప్రసాద్ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం పాల్గొన్నారు. కాగా, పెద్దమ్మతల్లిని టీపీసీసీ సభ్యుడు ఎడవల్లి కృష్ణ, – సుశీల దంపతులు సందర్శించి పూజలు చేశారు.

కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే రంజాన్ శుభాకాంక్షలు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/ఇల్లెందు: రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని కలెక్టర్ అనుదీప్, ఎస్పీ వినీత్, ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ ఆకాంక్షించారు. ఈ మేరకు శుక్రవారం వారు వేర్వేరుగా ప్రకటనలు చేశారు. దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసమని కలెక్టర్ పేర్కొన్నారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలు క్రమశిక్షణతో కూడిన జీవన శైలి, ఆధ్యాత్మికతను పెంపొందిస్తాయని హరిప్రియ తెలిపారు.

హైకోర్టు అసిస్టెంట్ ప్లీడర్‌గా దమ్మపేట వాసి



రమేష్‌బాబు

దమ్మపేట: హైకోర్టు అసిస్టెంట్ ప్లీడర్‌గా దమ్మపేట మండలం అంకంపాలెం గ్రామానికి చెందిన పెనుబల్లి రమేష్‌బాబు ఎంపికయ్యారు. హైకోర్టు శుక్రవారం విడుదల చేసిన జాబితాలో రమేష్‌బాబుకు చోటు దక్కడం పట్ల మండల వాసులు హర్షం వ్యక్తం చేశారు.

రామాలయ ఉద్యోగులకు ఈఓ అభినందన

భద్రాచలంఅర్బన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిని ఈఓ ఎల్.రమాదేవి శుక్రవారం అభినందించారు. ప్రసాదాలు అందించి, ఘనంగా సన్మానించారు. అనంతరం ఈఓ మాట్లాడుతూ ఇటీవల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ రామనవమి, పుష్కర పట్టాభిషేకం వేడుకల జయప్రదానికి సిబ్బంది శక్తి వంచన లేకుండా కృషి చేశారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కూడా భక్తులకు ఇలాగే సేవలందించాలని సూచించారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంటౌన్: మహిళా శక్తి కేంద్రాల(డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ విమన్ ఎంపవర్‌మెంట్)లో కాంట్రాక్ట్ పద్ధతిన ఉద్యోగాల భర్తీకి అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అందర్-బాహర్‌తో అధోగతే !



పేకాటరాయుళ్ల బలహీనతే పెట్టుబడి

- కోడి పందేల పేరుతో జూదరులకు వల
- విచ్చలవిడిగా సాగుతున్న పత్తాలాట
- ఆరంభం అదుర్స్, చివరకు మిగిలేది శూన్యం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సరిహద్దులో సాగుతున్న కోడి పందేలు, పేకాట క్లబ్బుల నిర్వాహకులు పైసా పెట్టుబడి లేకుండా ఖజానా నింపుకుంటున్నారు. అక్కడ పెట్టుబడి, నష్టం అంతా పేకాట, పందెం రాయుళ్లదే కాగా, లాభాలు మాత్రం నిర్వాహకులవి. అప్పనంగా కాసుల వర్షం కురుస్తుండడంతో ఆంక్షల 'హద్దులు' చెరిపేసి మరీ పేకాట, కోడి పందేలు జోరుగా సాగిస్తున్నారు. అందర్ – బాహర్ (లోపల – బయట) ఆటతో జేబులు ఖాళీ చేస్తున్నారు.

బలహీనత ఆధారంగా..

సరదా పురుషులకు కోడి పందేలతో పాటు కచ్చితంగా పత్తాలాట కూడా ఉండాల్సిందే. ఈ ఆట ఆడేందుకు, అక్కడ వచ్చిన సొమ్ముతో జల్సా చేసేందుకు ఎక్కడికైనా వెళ్లేందుకు సిద్ధపడతారు. అందువల్లే ఇటు తెలంగాణలో పేకాట క్లబ్బులపై, అటు ఆంధ్రాలో కోడి పందేలపై ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపాయి. దీంతో పేకాటరాయుళ్లు, కోడి పందెం వీరులకు మామిడి, పామాయిల్ తోటల్లో పేకాట, కోడి పందేలు ఆడటం రివాజుగా మారింది. జల్సారాయుళ్ల బలహీనతను ఆధారంగా చేసుకుని వారి సంపదను కొల్లగొట్టేందుకు తెలుగు రాష్ట్రాలకు సరిహద్దుల్లో పేకాట, కోడి పందేల శిబిరాలు ఏర్పాటవుతున్నాయి. పరిచయస్తుల ద్వారా వాట్సాప్ గ్రూపులను క్రియేట్ చేస్తూ, ఆ తర్వాత సరైన సమయం చూసుకుని శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇలాంటి శిబిరమే దుమ్ముగూడెం మండలం మారాయిగూడెం సరిహద్దులో ఛత్తీస్‌గఢ్‌లోని మారాయిగూడలో వెలిసింది.

కోడి పందెం పేరుతో వల..

పేకాటతో పోల్చితే కోడి పందేలు ఆడటాన్ని సామాజికంగా తక్కువ స్థాయి చెడు అలవాటుగా పరిగణిస్తుంటారు. నేరుగా పత్తాలాటకు రమ్మంటే వచ్చే వారు కూడా తక్కువ. కానీ సరదాగా కోడి పందేలు చూద్దాం రమ్మంటే జల్సారాయుళ్లతో పాట తటస్థులు కూడా ఎక్కువగా వచ్చేందుకు ఆస్కారం ఉంటుంది. ఇలా జల్సారాయుళ్లతో పాటు వారి స్నేహితులను కూడా కోడి పందేల పేరుతో ఈ శిబిరాలకు రప్పిస్తున్నారు. తీరా ఇక్కడికి వచ్చాక కోడి పందేలు జరిగేది కాసేపే. ఆ తర్వాత నేరుగా జూద క్రీడలకు తెర లేపుతున్నారు. సరదా పేరుతో ప్రారంభించి.. చివరకు జేబులు ఖాళీ అయ్యేంతవరకూ ఆటలు కొనసాగుతూనే ఉంటాయి.

ఆటలో మునిగాక లూటీ..

ఈ శిబిరాల్లో జరిగే అందర్ – బాహర్ ఆటలో జల్సారాయుళ్లు ముందుగా భారీ లాభాలు అందుకునేలా నిర్వాహకులు జాగ్రత్త పడతారు. ఒక్కసారి ఆటలో మునిగిపోయాక లూటీ మొదలవుతుంది. డబ్బు కంటే పట్టుదలే ముఖ్యమనే స్థాయికి ఆట చేరుతుంది. నిమిషాల వ్యవధిలో రూ.వేలు, లక్షలు చేతులు మారుతుంటాయి. ఇంకోసారి లక్ చిక్కితే అప్పులన్నీ పోయినట్టే అనే భావన ఓడిపోయిన వారిలో కలుగుతుంది. కానీ చివరకు ఎక్కువ మంది పేకాటరాయుళ్లు చేతిలో చిల్లిగవ్వ లేని స్థితికే చేరుతుంటారు. ఊరు కాని ఊరు, ప్రాంతం కాని ప్రాంతంలో చేసేది లేక నిరాశతో వెనుదిరుగుతారు. రాబోయే ఆటలో నష్టాలన్నీ పూడ్చుకోవాలనే కసితో ఇంటిదారి పడతారు. అప్పు చేసి మరీ మళ్లీ అక్కడికి వెళుతుంటారు. శిబిరం నిర్వాహకులు, వారి సంబంధీకులే తమను ఆటలో మోసం చేశారని తెలుసుకునే లోపు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలోకి చేరుకుంటారు. వెరసి ఈ శిబిరానికి ఆకర్షితులైన వ్యక్తులు, వారి కుటుంబ సభ్యులు అధోగతి పాలవుతున్నారు.

లోపల - బయట..

ప్రతీ సోమ, బుధ, శనివారాల్లో ఈ శిబిరాల్లో సందడి మొదలవుతుంది. అక్కడికి వచ్చే సందర్శకుల సంఖ్యను బట్టి ఆటల్లో మార్పులు చేర్పులు ఉంటాయి. ముందుగా కోడి పందేలు ప్రారంభిస్తారు. సరదారాయుళ్ల సంఖ్య పెరగగానే కోడి పందేలు సైడ్ ట్రాక్ ఎక్కి, పత్తాలు రంగంలోకి వచ్చేస్తాయి. వీటితో లోపల – బయట (అందర్ – బాహర్) ఆట మొదలెడతారు. శిబిరం నిర్వాహకులు ముందుగా ఈ ఆటలో ఉత్సాహంగా పాల్గొంటారు. నిమిషాల వ్యవధిలోనే వేల రూపాయలు సొంతం చేసుకుంటూ అక్కడికి వచ్చిన వారిని ముగ్గులోకి లాగుతారు. ఐపీఎల్‌లో చీర్ లీడర్స్ తరహాలో మరికొందరు అక్కడే ఉంటూ ఆట ఆడేవారిలో ఉత్సాహం నింపుతుంటారు. మొత్తానికి అందర్ – బాహర్ మొదలైన అరగంటలోనే అక్కడికి వచ్చిన వారిలో నూటికి 90 మంది పత్తాలాటకు సై అనేలా చేస్తారు.

పచ్చదనంలో ఐడీఓసీకి గోల్డెన్ ట్రోఫీ



మెమెంటోతో కలెక్టర్ అనుదీప్, ఉద్యాన అధికారి మరియన్న

సూపర్‌బజార్(కొత్తగూడెం): గార్డెన్ ఫెస్టివల్‌లో జిల్లా ఐడీఓసీకి గోల్డెన్ ట్రోఫీ, ప్రశంసాపత్రం, మెమెంటో రావడం హర్షణీయమని కలెక్టర్ అనుదీప్ అన్నారు. ట్రోఫీ సాధించిన సందర్భంగా శుక్రవారం ఐడీఓసీలో కలెక్టర్‌ను జిల్లా ఉద్యాన శాఖ అధికారి మరియన్న కలిశారు. ఈ సందర్భంగా అనుదీప్ మాట్లాడుతూ.. గత శనివారం హైదరాబాద్‌లో వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డి, ఉద్యాన సంచాలకులు హనుమంతరావు చేతుల మీదుగా జిల్లా ఉద్యాన శాఖాధికారి జినుగు మరియన్న ట్రోఫీ, ప్రశంసాపత్రం, మెమెంటో అందుకున్నారని వివరించారు. ఐడీఓసీలో ఐదెకరాల విస్తీర్ణంలో 205 రకాల పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలతోపాటు ఔషధ గుణాలు కలిగిన మొక్కలను కూడా నాటినట్లు తెలిపారు. భద్రాచలం ప్రధాన రహదారికి పక్కనే ఉండడంతో ప్రజలు ఈ కార్యాలయాన్ని సందర్శిస్తున్నారని చెప్పారు. పచ్చదనం సంతరించుకునే విధంగా మొక్కలు, లాన్ ఏర్పాటుతో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడిందన్నారు. దీని కోసం విశేష కృషి చేసిన జిల్లా ఉద్యాన శాఖాధికారి మరియన్న, అటవీ డివిజనల్ అధికారి ఆసొల్ల అప్పయ్యను కలెక్టర్ అభినందించారు. మొక్కలకు సమృద్ధిగా నీరు అందించేందుకు రూ.18 లక్షల వ్యయంతో అధునిక పాపప్స్, బిందుసేద్య పరికరాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు.

రైతుల సమస్యలపై సలహాలిస్తాం



మాట్లాడుతున్న భానుమతి, పక్కన జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యుడు తదితరులు

న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి

కొత్తగూడెంరూరల్: రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి చెప్పారు. లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు రైతు వేదికలో శుక్రవారం ఆమె న్యాయ సహాయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు పడుతున్న పలు రకాల ఇబ్బందులను పరిష్కరించడంతో పాటు తగిన సలహాలు, సూచనలు అందించేందుకు ఈ కేంద్రం ఉపకరిస్తుందని తెలిపారు. విత్తన చట్ట ప్రకారం సర్టిఫికెట్ పొందిన కంపెనీ నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, వాటికి రశీదు తీసుకోవాలని సూచించారు. రైతులకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. మరో వారం రోజుల్లో భద్రాచలం, ఇల్లెందు, మణుగూరు ప్రాంతాల్లోనూ న్యాయ సహాయ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కొత్తగూడెం మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.దీప, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అభిమన్యుడు, ఉద్యానవన శాఖ అధికారి మరియన్న, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలర్ వి.పురుషోత్తం రావు, డిప్యూటీ కౌన్సిలర్ నిరంజన్‌రావు, సర్పంచ్‌లు ప్రశాంత్, చంద్రశేఖర్, సీనియర్ న్యాయవాది లక్కినేని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారం చూపరూ..!

- కరకట్టపై డంపింగ్‌యార్డ్ తొలగించాలని స్థానికుల ఆందోళన
- ప్రజారోగ్యంపై నిర్లక్ష్యమేంటని ఎమ్మెల్యే ఆగ్రహం
- చర్చనీయాంశంగా మారిన 'సాక్షి' కథనం



గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాలనీవాసులు

భద్రాచలం : కలెక్టరు సారూ.. కనికరించండి అంటూ కాలనీ వాసులు రోడ్డెక్కారు. ప్రజారోగ్యం పట్టదా అని స్థానిక ఎమ్మెల్యే పొదెం వీరయ్య గ్రామ పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తంగా గోదావరి కరకట్టపై డంపింగ్ యార్డుతో స్థానిక కాలనీ వాసులు, భక్తులు పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి'లో ప్రచురితమైన 'రావణకాష్టంలా డంపింగ్ యార్డు' కథనం తీవ్ర చర్చకు దారితీసింది. రామాలయం చుట్టుపక్కల కాలనీవాసులతో పాటుగా ఎమ్మెల్యే పొదెం వీరయ్య శుక్రవారం పలుచోట్ల దీనిపై స్పందించారు. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఆధునిక టెక్నాలజీతో మెప్పించలేరా..

కరకట్టపై చెత్త సమస్యకు పరిష్కారం చూపేలా సుందరయ్య నగర్‌లో నాలుగెకరాల ప్రభుత్వ స్థలంలో డంపింగ్ యార్డు, రెండెకరాల్లో పార్కు నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. డంపింగ్ యార్డులో చెత్త కాలుస్తుండడంతో ఆ పొగతో ప్రజలకు ఇబ్బందితో పాటు పర్యావరణానికీ హాని కలుగుతోంది. ఈ సమస్య పరిష్కారానికి రూ.కోటి వ్యయంతో ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి డంపింగ్ యార్డు నిర్మాణానికి పనులు ప్రారంభించారు. తడి, పొడి చెత్తను వేరు చేయటంతో పాటుగా రీ సైక్లింగ్ ద్వారా పర్యావరణ హాని కలుగకుండా ఉండేలా పనులను చేపట్టారు. అయితే ప్రస్తుత డంపింగ్ యార్డుతో స్థానికులు పడుతున్న ఇబ్బందులు తమకూ వస్తాయనే ఉద్దేశంతో సుందరయ్య నగర్ పరిసర వాసులు నిర్మాణం నిలిపేయాలంటూ ఆందోళన చేశారు. అధికారులు సైతం ఈ సమస్యను గాలికొదిలేశారు. అయితే జిల్లా అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తే ఈ సమస్య ఇప్పటికే పరిష్కారమయ్యేదని స్థానికులు అంటున్నారు. పర్యావరణ హితంగా జరిగే నిర్మాణంపై స్థానికులకు అవగాహన కల్పించాల్సిందని చెబుతున్నారు.

ఇలా చేస్తే సరి..

ఆధునిక టెక్నాలజీ యంత్రాలతో పర్యావరణానికి హాని కలగకుండా డంపింగ్ యార్డు నిర్మించవచ్చు. బెయిలింగ్ మిషన్‌తో ప్లాస్టిక్‌ను పూర్తిగా ఒత్తి ముద్దగా తయారు చేసి, వాడిన ప్లాస్టిక్ ఉపయోగకరంగా లేకుండా చేయొచ్చు. అలాగే కన్వేయర్ బెల్ట్‌తో చెత్త నుంచి ప్లాస్టిక్ ఇతర వస్తువులను వేరు చేసేందుకు ఉపయోగించవచ్చు. చెత్త నుంచి కొబ్బరిబొండాలను వేరు చేసేందుకు షట్టర్‌ను, తడి చెత్తతో ఎరువు తయారీ చేసేలా స్క్రీనింగ్ మిషన్‌ను ఉపయోగించవచ్చు. ఇల్లెందు మున్సిపాలిటీలో పర్యావరణానికి హాని కలగకుండా డంపింగ్ యార్డును ఈ యంత్రాలతో ప్రస్తుతం విజయవంతంగా అమలు చేస్తున్నారు. అదే పద్ధతిని భద్రాచలంలోనూ అమలు చేయొచ్చని స్థానికులు సూచిస్తున్నారు.

ప్రజారోగ్యం పట్టదా..?

జిల్లా, గ్రామపంచాయతీ అధికారులకు ప్రజారోగ్యం పట్టదా అంటూ భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ ఈఓ వెంకటేశ్వర్లుతో కలిసి శుక్రవారం ఆయన కరకట్టపై ఉన్న డంపింగ్ యార్డును పరిశీలించారు. యార్డులో చెత్త, దాని వ్యర్థాల నుంచి వస్తున్న దుర్వాసన, కాలడంతో వచ్చే కాలుష్యాన్ని చూసి ఆందోళన చెందారు. డంపింగ్ యార్డు మార్చాలని పలుమార్లు ఆదేశించినా చర్యలెందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. గోదావరిని అపవిత్రం చేస్తే భక్తులు ఇబ్బంది పడతారని, తక్షణమే డంపింగ్ యార్డును ఇక్కడి నుంచి మార్చాలని ఆదేశించారు.

విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందించాలి

డీఈఓ సోమశేఖరశర్మ



డీఈఓ సోమశేఖరశర్మ

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు 1 నుంచి 9 తరగతి విద్యార్థుల ప్రగతి పత్రాలను ఐఎస్ఎంఎస్ పోర్టల్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని పిల్లలకు అందించాలని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. శుక్రవారం డీఈఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 4 ఎఫ్ఏలు, 2 ఎస్ఏల మార్కులను పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. 22, 23 తేదీల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసి, 24న జరిగే తల్లిదండ్రుల సమావేశంలో వారికి అందించాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సర ప్రణాళికపై తల్లిదండ్రులతో చర్చించాలని, ఈ ఏడాది వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించాలని సూచించారు. విద్యా సంవత్సరం ముగింపు వేడుకలను పాఠశాలల్లో పండగ వాతావరణంలో జరపాలన్నారు. సమావేశంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఏ.నాగరాజశేఖర్, సమ్మిళిత విద్య కో–ఆర్డినేటర్ ఎస్‌కే.సైదులు, గణాంక అధికారి ఎస్.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రామయ్య దర్శనానికి రండి



ఏపీ హోం మంత్రి వనితకు జ్ఞాపిక అందజేస్తున్న శ్రీనివాస్

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి వారి దర్శనానికి రావాలని ఏపీ హోం మంత్రి తానేటి వనితను ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు చారుగుళ్ల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఏపీలోని కొవ్వూరులో శుక్రవారం హోం మంత్రిని కలిసి స్వామివారి మూలమూర్తుల జ్ఞాపిక, అందజేసి సత్కరించారు. వెంకట పద్మరమణ పాల్గొన్నారు.

గోశాలకు తరలింపు

భద్రాచలంఅర్బన్: అక్రమంగా వాహనంలో తరలిస్తున్న 21 పశువులను పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లో శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. వాహనాల తనిఖీ క్రమంలో పట్టుకుని, పాల్వంచ గోశాలకు తరలించినట్లు టౌన్ సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు.

దశదినకర్మకు వెళ్లి గుండెపోటుతో మృతి

అశ్వాపురం: మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన కోటపాటి జితేందర్(37) బంధువు దశదినకర్మకు మరిపెడ బంగ్లా వెళ్లాడు. సాయంత్రం సమయంలో బహిర్భూమికి వెళ్లి అక్కడే కుప్పకూలి మృతి చెందాడని కుటుంబీకులు తెలిపారు. మృతుడి భార్య గతంలోనే మృతి చెందింది. దీంతో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. కాగా మృతుడు ఎల్అండ్‌టీ కంపెనీలో బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు.

రూ.25 వేలు జరిమానా

టేకులపల్లి: మూడు రోజుల క్రితం మండలంలోని ఒంటిబోడు వద్ద బోరు వేస్తుండగా అటవీశాఖ అధికారులు అప్రమత్తమై బోరు బండిని తీసుకెళ్లి పోలీస్ స్టేషన్ ముందు ఉంచారు. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు లేదు. శుక్రవారం విచారణ జరపగా ఫారెస్టు అధికారులు అటవీ భూమిలో కాకుండా రెవెన్యూ భూమిలో బోరు వేసినట్లు గుర్తించారు. కాగా ఫారెస్టు అధికారులే బండికి రూ.25 వేలు జరిమానా విధించి వదిలి వేయడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ముస్తాబైన ఈద్గాలు

- నేడు జిల్లావ్యాప్తంగా ఈదుల్ ఫితర్ వేడుకలు
- ఉదయం ప్రత్యేక నమాజ్‌కు ఏర్పాట్లు పూర్తి
- ముగిసిన రంజాన్ ఉపవాసాలు



కొత్తగూడెం రైటర్‌బస్తీలోని కిన్నెరస్టేల్ ప్రాంతంలో ఈద్గా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మతపెద్దలు

కొత్తగూడెంటౌన్: ముస్లింలకు అత్యంత ఇష్టమైనది రంజాన్ మాసం. నెలరోజులపాటు భక్తిశ్రద్ధలతో రోజా(ఉపవాసం) పాటించిన ముస్లింలు శనివారం ఈదుల్ ఫితర్ వేడుకలను ఘనంగా జరుపుకోనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈద్గాల వద్ద ప్రార్థనలు చేయనున్నారు. ఇప్పటికే ఈద్గాలను, మసీదులను నిర్వాహకులు సుందరంగా తీర్చిదిద్దారు. షామియానాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలరే ప్రసంగం, 9.30 గంటలకు నమాజ్ ప్రారంభంకానుంది. ఈద్గాలో నమాజ్‌కు అందని వారు త్రీటౌన్ వద్ద ఉన్న జమా మసీదులో ఉదయం 10 గంటలకు నమాజ్ చేసుకునే అవకాశం ఉందని మత పెద్దలు చెబుతున్నారు. ఎండకాలం కావడంతో ఉదయం ప్రార్థనలకు వచ్చే ముస్లింలకు మంచినీటి సదుపాయంతో మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేయనున్నారు. జిల్లా కేంద్రం కొత్తగూడెం రైటర్ బస్తీలోని కిన్నెరస్టేల్ ప్రాంతంలోని ఈద్గా, రుద్రంపూర్, గౌతంపూర్, రామవరంలోని 2 ఇంక్లైన్ ఫిల్టర్ బెడ్ వద్ద ఉన్న ఈద్గాలలో నమాజ్‌కు ఏర్పాట్లు చేశారు. రామవరం, త్రీఇంక్లైన్, గౌతంపూర్, విద్యానగర్‌కాలనీ, రుద్రంపూర్, కొత్తగూడెం, రైటర్‌బస్తీ, బస్టాండ్ సెంటర్, సూపర్‌బజార్, కూలీలైన్, పాత కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, హెడ్ ఆఫీస్ ఏరియాలతో పాటు పలు ప్రాంతాల్లోని మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు చేయనున్నారు. పాల్వంచ, ఇల్లెందు, అశ్వారావుపేట, మణుగూరు తదితర ప్రాంతాల్లో కూడా ఈద్గాలను ప్రార్థనలకు సిద్ధం చేశారు. ఖురాన్ అవతరించింది ఈ మాసంలోనేనని, రంజాన్‌కు ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యత ఉందని మత పెద్దలు చెబుతున్నారు.

జకాత్ విశిష్టత

రంజాన్ నెలలో మరొక విశేషం అత్యధిక దాన ధర్మాలు చేయడం. సంపన్నులు జకాత్ ఆచరించాలని ఖరాన్ బోధిస్తుందని మతపెద్దలు పేర్కొంటున్నారు. ప్రతి ధనికుడు సంవత్సరాంతంలో తన సంపదలో 30 శాతం వరకు పేదలకు దానం చేస్తారు.

ఫిత్రా ప్రాముఖ్యత..

రంజాన్ మాసంలో ఫిత్రాకు కూడా ఎంతో ప్రాముఖ్యత ఉన్నది. రంజాన్ పండుగ ఉదయం నమాజ్‌కు ముందు రెండున్నర కిలోల గోధుమలు దానం చేయాల్సి ఉంటుంది. మూడు పూటల తిండికి, ఒంటి నిండా బట్టకు నోచుకోనివారినికి దానం చేయాలని ఇస్లాం మతం ఉద్బోధిస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం గిఫ్టల పంపిణీ

రంజాన్ పండుగకు పేద ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం గిఫ్ట్ ప్యాక్‌లను సైతం అందించింది. గిఫ్ట్ ప్యాక్‌లో ఒక చీర, సల్వార్ కమీజ్, కుర్తా పైజామాలతో కూడిన బ్యాగ్‌ను అందించారు.



రుద్రంపూర్‌లో ఈద్గాను సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

ప్రేమను పంచడమే రంజాన్ ఉద్దేశం



అందరికీ ప్రేమను పంచడమే రంజాన్ మాసం ముఖ్య ఉద్దేశం. 30 రోజులపాటు కఠిన ఉపవాస దీక్షలను, కఠిన నియమ నిబంధనలు పాటిస్తూ అల్లాను భక్తిశ్రద్ధలతో పూజిస్తాం. భక్తితో ఖురాన్ పఠిస్తూ జకాత్, ఫిత్రా, హజ్, సహార్ పాటిస్తూ నమాజ్ చేస్తాం. రంజాన్ మాసంలో కఠిన ఉపవాసంతో కామక్రోదం నియంత్రణ, ఆకలి విలువ తెలియజేయడమే రంజాన్ మాసం విశిష్టత.

– సయ్యద్ ఇస్మాయిల్, రుద్రంపూర్

108 మంది గిరిజనులకు అసైన్డ్ పట్టాలు



పట్టా అందజేస్తున్న ప్రభుత్వ విప్ రేగా, కలెక్టర్ అనుదీప్

కరకగూడెం: మండల పరిధిలోని రేగళ్ల పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం వివిధ గ్రామాలకు చెందిన 108 మంది గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, కలెక్టర్ అనుదీప్ 360 ఎకరాల అసైన్మెంట్ భూమి పట్టాలు, పాసుపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ అసైన్మెంట్ భూములకు పట్టాలు కావాలని దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. పట్టాలు పొందిన రైతులకు త్వరలో రైతుబంధు, రైతుబీమా వర్తిస్తాయని పేర్కొన్నారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ రైతులు భూమి పట్టాల విషయంలో మధ్యవర్తులను, దళారులను ఆశ్రయించకుండా నేరుగా తమను సంప్రదించాలని కోరారు. ధరణి పోర్టల్‌తో రెవెన్యూ సమస్యలు తీరాయని పేర్కొన్నారు. త్వరలోనే పులుసుబొంత ప్రాజెక్టు భూసేకరణ ప్రారంభిస్తామని తెలిపారు. రేగళ్ల పరిధిలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభించాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. కాగా తమ సమస్యలు పరిష్కరించాలని వీఓఏలతో పాటు మరికొందరు గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఉషా శారద, ఎంపీడీఓ శ్రీను, ఎంఈఓ వీరస్వామి, సర్పంచ్ కుంజ వసంతరావు పాల్గొన్నారు.

జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం



మంటల కారణంగా వ్యాపించిన పొగ

సుజాతనగర్: మండలంలోని డేగలమడుగు గ్రామ పరిధిలోని మంజీత్ కాటన్ ప్రైవేట్ లిమిటెడ్ జిన్నింగ్ మిల్లులో శుక్రవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మిల్లులో ఒక్కసారిగా వ్యాపించిన మంటలు కన్వేయర్ బెల్ట్ పైకి ఎగబాకాయి. దీంతో బెల్ట్ కాలిపోవడంతోపాటు అండర్‌గ్రౌండ్‌లోని సుమారు 20 క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. మిల్లులోని మిషన్లు కూడా పాక్షికంగా కాలిపోయినట్లు తెలిసింది. మంటల కారణంగా ఒక్కసారిగా నల్లని పొగ వ్యాపించింది. ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, మిల్లులో పనిచేసే సిబ్బంది మంటలను అదుపు చేశారు. కాగా ఎండవేడిమి కారణంగా కన్వేయర్ బెల్టు దగ్ధమై మంటలు వ్యాపించాయా? షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగిందా? అనేది తేలాల్సిఉంది.



గంజాయి పట్టివేత

పాల్వంచ: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ గురునాథ్ రాథోడ్ కథనం ప్రకారం.. పట్టణంలోని దమ్మపేట సెంటర్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని తనిఖీ చేయగా బ్యాగ్‌లో 950 గ్రాముల గంజాయి లభ్యమైంది. గంజాయి తాగే అలవాటు ఉన్న, హైదరాబాద్ బోడుప్పల్‌కు చెందిన విద్యార్థులు ధృవకుమార్ సింగ్, ప్రతీక్ నారాయణన్ చింతూరు నుంచి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నట్లు విచారణలో తేలింది. కేసు నమోదు చేసి ఖమ్మం జైలుకు పంపించారు. ఈ దాడిలో ఎస్‌ఐలు సీహెచ్.నాగేశ్వరరావు, ఐ.సురేశ్, భిక్షం సిబ్బంది ఉన్నారు.

దేవుడి భూమి అమ్మేశారు..

పోలీస్ స్టేషన్ ఎదుట గిరిజనుల ఆందోళన

అశ్వారావుపేట: ఆలయ అభివృద్ధికి కేటాయించిన 20 ఎకరాల వ్యవసాయ భూమిని గ్రామపెద్దలు కొందరు అమ్మేశారంటూ పలువురు గిరిజనులు అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్ ఎదుట శుక్రవారం ఆందోళన నిర్వహించారు. జమ్మిగూడెం గ్రామానికి చెందిన జమీందార్లకు చెందిన 20 ఎకరాల వ్యవసాయ భూమిని గతంలో గ్రామానికి చెందిన గిరిజనులకు అప్పగించారు. భూమిని ఎవరూ అనుభవించకుండా గ్రామ రామాలయ అభివృద్ధి నిమిత్తం కౌలుకు ఇస్తూ, వచ్చే ఆదాయం ధూప దీప నైవేద్యాలకు ఉపయోగిస్తున్నారు. కాగా గ్రామస్తులకు తెలియకుండా గ్రామపెద్దలు కొందరు భూమిని వేరే వారికి అమ్మేశారని ఆరోపిస్తూ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. కానీ పోలీసులకు లిఖిత పూర్వక ఫిర్యాదు ఇవ్వలేదు. సివిల్ వ్యవహారం కావడంతో రెవెన్యూ అధికారులను ఆశ్రయించాలని సీఐ బాలకృష్ణ సూచించారు.

పీడీ యాక్టు నమోదు

మణుగూరుటౌన్: మండలంలోని పలు భూవివాదాల్లో ప్రమేయం కలిగిన అలెం నరేంద్ర అలియాస్ అలెం కోటిపై పీడీ యాక్టు కేసు నమోదు చేసినట్లు మణుగూరు సీఐ ముత్యం రమేష్ తెలిపారు. ఇటీవల బీటీపీఎస్ రైల్వే లైన్ నిర్వాసితులకు కేటాయించిన భూముల్లో ఫెన్సింగ్ కూల్చడంతోపాటు పలు భూవివాదాల్లో పాల్గొంటుడటంతో మణుగూరు తహసీల్దార్ అతనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో పీడీయాక్టు కేసు నమోదు చేసి, అరెస్టు చేసి చర్లపల్లి జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

సకాలంలో వైద్యం అందక చిన్నారి మృతి

వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో అందుబాటులో లేని డాక్టర్లు



రిషీరాం (ఫైల్)

ఇల్లెందురూరల్: ప్రభుత్వ వైద్యం అందరికీ అందుబాటులో అనేది ఉత్తమాటేనని మరోసారి రుజువైంది. టీకా వేయగానే జ్వరం రావడంతో తన 45 రోజుల పసిబాబును బతికించుకునేందుకు తహతహలాడిన ఆ తల్లి.. చివరకు ఓటమి పాలైంది. మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామానికి చెందిన పూనపాటి హేమలత మార్చి 6న పండంటి బాబుకు జన్మనిచ్చింది. ఇద్దరు కుమార్తెల తరువాత బాబు పుట్టడంతో తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు. కానీ ఆ సంతోషం ఎంతో కాలం నిలవలేదు. ఈనెల 19న రిషీరాం(45 రోజులు)కు ప్రభుత్వ వైద్య సిబ్బంది ద్వారా టీకా వేయించారు. ఆ మరుసటి రోజు నుంచే తీవ్రంగా జ్వరం వచ్చింది. దీంతో తల్లి హేమలత వైద్య సిబ్బంది ఇచ్చిన టానిక్ పోసినా జ్వరం తగ్గలేదు. శుక్రవారం కూడా ఆ మందు పోసింది. కాసేపటి తర్వాత బిడ్డకు పాలిద్దామని చేతుల్లోకి తీసుకోగా కదలిక లేకపోవడంతో ఇల్లెందులోని వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రికి తీసుకొచ్చింది. అక్కడ డాక్టర్లు అందుబాటులో లేరని, ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లాలని సిబ్బంది సూచించారు. దీంతో ప్రైవేటు ఆస్పత్రుల చుట్టూ తిరగగా, చివరకు ఓ డాక్టర్ వైద్యం చేసేందుకు ప్రయత్నించాడు. అయితే కొద్దిసేపటి క్రితమే బాబు చనిపోయాడని, కొంచెం ముందుగా చికిత్స చేస్తే ఫలితం ఉండేదని ఆ వైద్యుడు చెప్పాడు. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేస్తే తన బిడ్డ బతికేవాడంటూ హేమలత కన్నీరుమున్నీరుగా విలపించింది.

అంగన్‌వాడీ హెల్పర్ ఆత్మహత్యాయత్నం



హెల్పర్ సుజాత

టేకులపల్లి: టేకులపల్లి–2 అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్‌గా పనిచేస్తున్న ఎం.సుజాత శుక్రవారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. కాగా అంగన్‌వాడీ టీచర్ భద్రమ్మ, ఆమె భర్తే ఇందుకు కారణమని, అధికారులకు చెప్పి నాకు మెమో ఇప్పించారని ఓ తెల్లకాగితంపై రాసింది. ఈ విషయమై సీడీపీఓ కె.ఎం.తారను వివరణ కోరగా.. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో అనేక సార్లు మందలించినా మార్పులేకపోవడంతో మెమో ఇచ్చామని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ భద్రమ్మను వివరణ కోరగా..16 సంవత్సరాలుగా కలిసి పని చేస్తున్నామని తెలిపారు. విధి నిర్వహణలో రోజూ నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తుండగా అధికారులు దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. దీంతో ఇంటికి వచ్చి నన్ను, నా భర్తను దుర్భాషలాడిందని, ఇవన్నీ పరిశీలించిన అధికారులు ఆమెకు మెమో ఇచ్చారని పేర్కొన్నారు.

పట్టాలు తప్పిన బొగ్గు రైలు

పాల్వంచ: కేటీపీఎస్ 5వ దశ కర్మాగారంలో శుక్రవారం బొగ్గు అన్‌లోడ్ చేసి తిరిగి వెళ్తున్న రైలు శేఖరం బంజర వద్ద గేదెను ఢీకొట్టి పట్టాలు తప్పింది. రైలు రెండు భాగాలుగా విడిపోవడంతోపాటు రెండు బోగీలు పట్టాలు తప్పాయి. రైల్వే అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మరమ్మతులు పూర్తి చేశారు. కాగా రెండు బోగీలు పట్టాలు తప్పడంతో సరిచేసి పంపించినట్లు సీఈ ప్రభాకర్ రావు తెలిపారు.



పట్టాలు తప్పిన రైల్వే వ్యాగన్

వివాహిత ఆత్మహత్య

గుండాల: పిల్లలు పుట్టడం లేదని నిత్యం భర్త వేధింపులకు గురిచేస్తుండటంతో ఓ వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సాయనపల్లి పంచాయతీ పరిధి తక్కెళ్లగూడెం గ్రామానికి చెందిన బచ్చల సురేష్‌కు పదేళ్ల క్రితం జగ్గాయిగూడెం గ్రామానికి చెందిన చైతన్య(36)తో వివాహం జరిగింది. దంపతులకు సంతానం కలగలేదు. ఈ క్రమంలో వారి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. గురువారం రాత్రి కూడా గొడవ జరగ్గా, తాను మరో పెళ్లి చేసుకుంటానని భర్త పేర్కొన్నాడు. దీంతో మనస్తాపం చెందిన చైతన్య శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలోని చేనులోకి వెళ్లి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు 108 ద్వారా గుండాల ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రానికి తరలిస్తున్న క్రమంలో పరిస్థితి విషమించి మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మల్టీపర్పస్ వర్కర్ వెంకటేశ్ మృతి

టేకులపల్లి: విద్యుదాఘాతంతో గాయపడి హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టేకులపల్లి మండలం చుక్కాలబోడు గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ భూక్య వెంకటేశ్ (28) శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఈ నెల 13న ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డులోని రైతు వేదికలో స్వచ్ఛ భారత్ మిషన్ సమావేశం సందర్భంగా.. రైతు వేదికలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డు సర్పంచ్ సురేందర్ వెంకటేష్‌ను పిలిపించి విద్యుత్ స్తంభం ఎక్కించి మరమ్మతులు చేయించాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతంతో గాయపడగా కొత్తగూడెం ఏరియా ఆస్పత్రి, అనంతరం హైదరాబాద్ ఉస్మానియాలో చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో రెండు కాళ్లు తొలగించారు. శరీరం కూడా సుమారు 70 శాతం వరకు కాలిపోయింది. తొమ్మిది రోజుల పాటు మృత్యువుతో పోరాడి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య దేవి, కుమార్తె సుస్మిత, కుమారుడు రామచంద్రునాయక్ ఉన్నారు.

వేసవి సెలవులోచ్..



విద్యాలయాలకు శుక్రవారం నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు ఇంటిబాట పట్టారు. పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల గురుకుల పాఠశాలల, కిన్నెరసాని, ఉల్వనూరు గిరిజన హాస్టళ్ల విద్యార్థులు పుస్తకాలు, బాక్స్‌లు, దుప్పట్లు సర్దుకుని తల్లిదండ్రులతో కలిసి ఇళ్లకు వెళ్లిపోయారు. దీంతో గురుకులాలు, హాస్టళ్ల వద్ద సందడిన నెలకొంది. – పాల్వంచరూరల్

సాధారణంగా అందరూ కాఫీ లేదా గరం గరం చాయ్‌తో రోజును ప్రారంభిస్తారు. అందులో కొత్తేమీ లేదు. బండిలో పెట్రోలు పోయకపోతే బండి ముందుకు కదలనని మొరాయించినట్లే ఇది కూడా! అయితే ఇది వేసవి కాబట్టి అలా కాఫీ, టీ లకు బదులుగా పోషకాలతో సమృద్ధిగా ఉన్న ఒక గ్లాసు ఆరోగ్యకరమైన పానీయం తాగటం చాలా మంచిదని అంటున్నారు నిపుణులు. కావాలంటే ఓ అరగంట గ్యాప్ ఇచ్చి, యథావిధిగా కాఫీనో, టీనో తాగచ్చు. అలా తాగడం ద్వారా ఉదయం పూట రిఫ్రెషింగ్ గా ఉంటుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఉత్సాహంగా పనులు చేసుకోగలుగుతారు. అలాంటి గుడ్ మార్నింగ్ డ్రింక్స్ కొన్నింటిని చూద్దాం.



మార్నింగ్ డ్రింక్‌తో రోజంతా హుషారుగా



తేనె- దాల్చిన చెక్క పానీయం

ఉదయం లేవగానే గ్లాసు గోరువెచ్చని నీటిలో రెండు చెంచాల తేనె, చిటికెడు దాల్చిన చెక్క పొడిని వేసి తాగాలి. ఇది మిమ్మల్ని రిఫ్రెష్ చేస్తుంది. కడుపును శుభ్రం చేస్తుంది.



నిమ్మరసం

ఒక గ్లాసు నిమ్మరసం సహజంగా శరీరంలో టాక్సిన్స్ ఏమీ లేకుండా చేస్తుంది. ఇది ఉదయం వేళ టీ లేదా కాఫీకి కూడా మంచి ప్రత్యామ్నాయం. గోరు వెచ్చని నీటిలో నిమ్మరసం కలుపుకొని తాగాలి, రుచి కోసం కొంచెం తేనెను కూడా కలపవచ్చు.



దాల్చిన చెక్క గ్రీన్ టీ

గ్రీన్ టీ తాగితే చాలా ప్రయోజనాలు ఉన్నాయి. జీర్ణక్రియ, కడుపు సమస్యలను నివారించడానికి, మీరు శుభోదయ పానీయంగా కప్పు గ్రీన్ టీ తాగవచ్చు. గ్రీన్ టీ రుచి ఇష్టం లేకపోతే అందులో ఒక చిటికెడు దాల్చిన చెక్క పొడి, తేనె కలిపితే సరి. ఆ పానీయాన్ని ఆస్వాదించవచ్చు.



కొబ్బరి నీరు

కొబ్బరి నీరు చాలా ఆరోగ్యకరమైన పానీయం. అప్పుడప్పుడూ ఉదయం పూట కొబ్బరి నీరు తాగుతుంటే మీకు మార్నింగ్ ఎనర్జీ డ్రింక్‌గా మాత్రమే కాదు, మీ శరీరాన్ని తక్షణమే హైడ్రేట్ చేసే రుచికరమైన పానీయం. సాదా కొబ్బరి నీరు తాగండి, ఇందులో ఏమీ కలపాల్సిన అవసరం లేదు.



అలోవెరా జ్యూస్

చాలారకాల చర్మ సంరక్షణ ఉత్పత్తులు కలబంద ఆధారితమైనవే ఉంటాయి. ఉదయం పూట కలబంద జ్యూస్ తాగటం ఎంతో ఉత్తమం. ఈ పానీయం ఉదయాన్నే తాగిన తరువాత, మీ శరీరం తక్షణమే చైతన్యం అవుతుంది. మీరు మీ రోజును ప్రారంభించడానికి తగిన తక్షణ శక్తి వస్తుంది. అంతేకాదు, చర్మసమస్యలు అన్నీ పోయి, మెరిసే చర్మం వస్తుంది.

దోసకాయ... పుదీనా జ్యూస్

దోసకాయ పుదీనా నీరు జ్యూస్ డిటాక్సింగ్ డ్రింక్. మీ శరీరం నుంచి మలినాలను, విషపదార్థాలను తొలగిస్తుంది. ఉదయం పూట మిమ్మల్ని లోపలి నుంచి శుభ్రపరుస్తుంది. మీ ఆరోగ్యకరమైన ఉదయం దినచర్యకు ఇది మంచి డ్రింక్. ముఖ్యంగా వేసవిలో పుదీనాతో కలిసిన దోసకాయ డ్రింక్ మీ శరీరాన్ని చల్లబరుస్తుంది.



రోజ్ షర్బత్

ముందుగా సబ్జా గింజలను నీటిలో నానబెట్టండి, ఈ లోపు రోజ్ సిరప్ సిద్ధం చేసుకోండి. ఒక గుప్పెడు తాజా గులాబీ పువ్వు రెమ్మలను తీసుకొని ఒక గిన్నె నీటిలో ఉడికించండి. మరొక గిన్నెలో చక్కెర, నీరు కలిపి చక్కెర పాకం తయారు చేయండి. చక్కెర పాకంలో ఉడికించిన గులాబీ నీరు ఫిల్టర్ చేసుకొని బాగా కలిపేస్తే రోజ్ సిరప్ రెడీ. ఇప్పుడు మెత్తగా నానబెట్టిన సబ్జా గింజలను వడకట్టి ఒక గ్లాసులోకి తీసుకోండి.అందులో రోజ్ సిరప్, ఐస్ క్యూబ్స్, కోల్డ్ వాటర్ వేసి కలపండి, పై నుంచి నిమ్మరసం పిండుకోండి. అంతే, రోజ్ షర్బత్ రెడీ.

వేసవి అంతా రోజూ ఉదయం పూట ఇలాంటి ఏదైనా ఒక పానీయం తాగటం ద్వారా మీరు రోజంతా చురుకుగా, హుషారుగా ఉంటారు.

మీకు తెలుసా?

మొలకెత్తిన బంగాళదుంపలు తింటే మన ఆరోగ్యానికే పెను ముప్పు తెచ్చిపెడతాయి. బంగాళదుంపలపై వచ్చే మొలకలు విషపూరితమైనవని చెబుతున్నారు నిపుణులు. ఒక్కోసారి ఫుడ్ పాయిజన్‌కి దారి తీసి ప్రాణాల మీదకు కూడా తెస్తుంది. బంగాళదుంపలపై ఏర్పడే మొలకల్లో గ్లైకో అల్కాయిడ్స్ అనే విషపూరితమైన రసాయన పదార్థాలు ఉంటాయి. మొలకెత్తిన బంగాళదుంపల్లో అధిక స్థాయిలో ఈ రసాయన పదార్థం ఉంటుంది. వీటిని తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఇవి తిన్న కొద్ది గంటలలోనే వాంతులు, విరోచనాలు, పొత్తి కడుపులో నొప్పి వంటి అనారోగ్య సమస్యలతో బాధపడాల్సి ఉంటుంది. అంతేకాకుండా లో బీపీ, పల్స్ ఎక్కువగా కొట్టుకోవడం, జ్వరం, తల నొప్పి, మతిమరుపు.. కడుపులో నొప్పి, గుండె సంబంధిత వ్యాధులు, నాడీ వ్యవస్థ దెబ్బతినడం వంటి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. మొలకెత్తిన ఆలుగడ్డలను గర్భిణీలు తింటే పుట్టబోయే బిడ్డపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని అంటున్నారు. బంగాళదుంపలను చల్లని, చీకటి ప్రదేశాల్లో నిల్వ ఉంచడం ద్వారా అవి మొలకెత్తడాన్ని నివారించవచ్చు.



ఎండలో కంటికి అండగా...



వేసవి కాలంలో చర్మానికి సంబంధించిన సమస్యలే కాదు, కళ్లకు సంబంధించిన సమస్యలు కూడా ఆందోళన కలిగిస్తాయి. ఎండవేడిమికి గురికావడం వల్ల కళ్లు పొడిబారడం లేదా మంటలు పుట్టడం, ఎర్రబారడం వంటి సమస్యలు వస్తాయి. అలా కాకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు పాటించడంతోపాటు కొన్ని రకాల ఆహార పానీయాలు తీసుకోవడం మంచిది. అవేమిటో చూద్దాం.

కంటి ఆరోగ్యాన్ని కాపాడే వాటిలో నిమ్మరసం కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఇది ఎండలనుంచి ఉపశమనాన్ని ఇవ్వడమే కాకుండా, కళ్ల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే పనిని కూడా చేస్తుంది. ఎందుకంటే, నిమ్మరసంలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది, ఇది ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుంచి కళ్ళను రక్షిస్తుంది. అంతే కాదు, నిమ్మకాయలో విటమిన్ ఎ కూడా ఉంటుంది, ఇది దృష్టిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. నిమ్మరసంలో ఉండే లుటిన్, జియాక్సంతిన్ అనే ముఖ్యమైన పోషకాలు మాక్యులర్ డీ జనరేషన్, కంటిశుక్లం నుండి కళ్ళను రక్షించడంలో సహాయపడతాయి. నిమ్మకాయలో ఉండే విటమిన్ సి కళ్ల రక్తనాళాలను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. ఇది రెటీనాకు రక్త ప్రసరణ జరిగేలా చూస్తుంది. తద్వారా కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

ఇంకా పుచ్చకాయ, కర్బూజ, మామిడి, బొప్పాయి పండ్లు తినడం, కొబ్బరినీళ్లు తాగడం, ఆహారంలో ఉల్లిపాయలను బాగా ఉపయోగించడం వల్ల కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.

కళ్లు మంటలు ఉన్నప్పుడు కాసిని మల్లెపూలను ఒక గ్లాసు నీళ్లలో వేసి అరగంట తర్వాత ఆ నీటితో కళ్లను కడుక్కుంటే ఉపశమనం కలుగుతుంది. అలాగే, చక్రాలుగా తరిగిన కీరాముక్కలను లేదా బంగాళదుంప ముక్కలను కళ్ల మీద ఉంచుకోవడం కూడా ప్రయోజనకరం. కొంతమందికి రాత్రిపూట కళ్లు కనిపించవు. ఈ వ్యాధిని రేచీకటి అంటారు. ఆహారంలో విటమిన్ ఎ ఆధారిత ఆహారాన్ని తక్కువగా తీసుకోవడం వల్ల ఈ సమస్య ఎదురవుతుంది. దీనిని నివారించాలంటే పాలకూర, బొప్పాయి, క్యారెట్ ఎక్కువగా తీసుకోవాలి. ఆకుకూరల్లో తోటకూర, పొన్నగంటి కూర కంటికి చాలా మంచిది.

ఈ కాలంలో వీచే వడగాలులు చాలా ప్రమాదకరం. వేడిమికి కళ్లల్లో ఉండే తేమ ఆవిరైపోతుంది. ఫలితంగా కంటి వద్ద చర్మం పొడిబారి, కళ్లల్లో ఇసుక వేసినట్లుగా ఉంటుంది. గాలులకు దుమ్ము, ధూళి కంట్లో పడడం వల్ల కళ్ల దురద, మంటలు వస్తాయి. అందువల్ల బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా సన్ గ్లాసులు పెట్టుకోవాలి. ఇంటికి చేరిన వెంటనే చల్లని నీటితో ముఖం కడుక్కోవాలి.

హెల్త్ టిప్స్





అల్లం అంగుళం ముక్క, బెల్లం చిన్న ముక్క తీసుకుని రెండూ కలిపి రాత్రి పడుకోబోయేముందు నమిలి తింటే మల బద్ధకం పోతుంది.



మెంతికూర చిన్నదిగాని, పెద్దదిగాని కూర చేసుకుని రోజూ కనీసం మూడు నెలలు తింటే రక్తహీనత తగ్గుతుంది.



వేపనూనె, కర్పూరం కలిపి రాస్తే తలలోని కురుపులు మాడిపోతాయి, చుండ్రు తగ్గుతుంది.

మొదటి విమాన ప్రయాణమా?

మొదటిసారి విమాన ప్రయాణం చేస్తున్నప్పుడు చాలా ఆసక్తిగా ఉంటుంది. విమాన ప్రయాణం చేసేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఆహారం విషయంలో అలర్ట్‌గా ఉండాలి. ఏమీ తినకుండా లేదా ఫుల్లుగా తిని విమాన ప్రయాణం చేయకూడదు. ముఖ్యంగా కొన్ని ఆహారపదార్థాలకి దూరంగా ఉండాలి. అవేంటో చూద్దాం...




విమానంలో ప్రయాణించే ముందు బిర్యానీ, ఊరగాయలు వంటి ఆయిల్, స్పైసీ ఫుడ్ తింటే కడుపు నొప్పి వస్తుంది. గుండె మంట, మూత్రాశయం చికాకు సమస్యలు వస్తాయి. ఇవిఅధిక కేలరీలను కలిగి ఉండటంతోబాటు వీటి మూలాన నోటి నుంచి వాసన వస్తుంది. అదేవిధంగా ఎయిర్‌పోర్ట్‌లో కంటికి ఇంపుగా నోరూరిస్తూ కనిపించే రకరకాల ప్యాకేజ్డ్ ఫుడ్ తీసుకోవడం అసలు మంచిది కాదు. ప్రయాణించే ముందు బర్గర్ లేదా ఫ్రెంచ్ ఫ్రైస్ తినడం వల్ల అరుగుదల సరిగా లేక గుండెల్లో మంట వస్తుంది. అలాగే ఆపిల్ తినడమూ అంత మంచిది కాదు. ఎసిడిటీ లేదా గ్యాస్ సమస్య ఏర్పడుతుంది. యాపిల్స్‌లో చక్కెర అధికంగా ఉండటం వల్ల అది పేగు ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. అయితే బొప్పాయి లేదా నారింజ పండ్లను తినవచ్చు. చాలామంది ఫ్లైట్ ఎక్కే ముందు ఏదో ఒక రకమైన స్నాక్స్ తింటారు. అయితే ఆరోగ్యనిపుణుల అభిప్రాయం ప్రకారం స్నాక్స్ అజీర్ణం, వికారం లేదా ఉబ్బరం కలిగిస్తాయి. అలాగే విమాన ప్రయాణానికి ముందు బ్రోకలీతో చేసిన ఆహారాలు కూడా తినకూడదని గుర్తుంచుకోండి.

సినిమా

ఆటకు వేళాయె అంటూ కొందరు స్టార్స్ ప్లేయర్స్‌గా మారారు. క్రికెటర్లుగా, కోచ్‌లుగా మౌల్డ్ అయిపోయారు. అయితే ఈ ఆట అంతా సినిమాల కోసమే. ప్రస్తుతం క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లో కొన్ని చిత్రాలు రూపొందుతున్నాయి. కొన్ని కాల్పనిక కథలు కాగా, కొన్ని బయోపిక్స్ కూడా ఉన్నాయి. ఇక వెండితెరపై క్రికెటర్లుగా అలరించనున్న స్టార్స్ గురించి తెలుసుకుందాం.

ఆటకు వేళాయె



రజనీకాంత్


● సూపర్ స్టార్ రజనీకాంత్ ఓ క్రికెట్ మ్యాచ్ నిర్వహణ మీద ఉన్నారు. 'లాల్ సలామ్' చిత్రం కోసమే ఇదంతా. రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్యా రజనీకాంత్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ఇది. క్రికెట్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో విష్ణువిశాల్, విక్రాంత్ లీడ్ రోల్స్‌లో, రజనీకాంత్, జీవితా రాజశేఖర్ కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ చిత్రంలో రజనీకాంత్ క్రికెట్ కోచ్ పాత్రలో కనిపిస్తారనీ, తమిళనాడు క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధిగా కనిపిస్తారనీ ప్రచారం జరుగుతోంది. మరి.. రజనీ ఏ పాత్రలో కనిపిస్తారో చూడాలి. 'లాల్ సలామ్' చిత్రం ఈ ఏడాదే రిలీజ్ కానుంది.



సిద్ధార్థ్



నయనతార



మాధవన్

● క్రికెట్ గ్రౌండ్‌లో బిజీగా ఉంటున్నారు మాధవన్, సిద్ధార్థ్, నయనతార. ఈ ముగ్గురూ కలిసి సిల్వర్ స్క్రీన్‌పై ఆడనున్న మ్యాచ్ 'ది టెస్ట్'. తమిళ నిర్మాత శశికాంత్ దర్శకుడిగా పరిచయం అవుతున్న సినిమా ఇది. ఈ చిత్రంలో నయనతార, మాధవన్, సిద్ధార్థ్ లీడ్ రోల్స్ చేస్తున్నారు. టెస్ట్ క్రికెట్ ఫార్మాట్‌లో ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు సమాచారం. పాన్ ఇండియా స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం తమిళ్, తెలుగు, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల కానుంది.

● శ్రీలంక మాజీ క్రికెటర్, స్పిన్ మాంత్రికుడు ముత్తయ్య మురళీధరన్ బయోపిక్ '800' టైటిల్‌తో తెరకెక్కుతోంది. 'స్లమ్ డాగ్ మిలియనీర్' చిత్రంలో సలీమ్ మాలిక్ పాత్ర చేసిన మధుర్ మిట్టల్ ఈ చిత్రంలో మురళీధరన్ పాత్ర చేస్తున్నారు. ముత్తయ్య భార్య మదిమలర్ పాత్రను మహిమా నంబియార్ చేస్తున్నారు. ''మురళీధరన్ జీవితంలోని పలు కోణాలను ఈ చిత్రంతో వెండితెరపై ఆవిష్కరించనున్నాం. 800 వికెట్లు తీసిన ఏకైక ఆఫ్ స్పిన్ బౌలర్‌గా మురళీధరన్ పేరిట రికార్డు ఉంది. తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేయనున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



మధుర్ మిట్టల్

● భారత ప్రముఖ మాజీ క్రికెటర్ జులన్ గోస్వామి జీవితం ఆధారంగా రూపొందిన వెబ్ మూవీ 'చక్దా ఎక్స్‌ప్రెస్'. ఇందులో జులన్ గోస్వామిగా అనుష్కా శర్మ నటించారు. ప్రోసిత్ రాయ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ ఏడాది చివర్లో నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. పశ్చిమ బెంగాల్ చక్దా ప్రాంతానికి చెందిన జులన్ గోస్వామి దాదాపు రెండు దశాబ్దాలు మహిళా క్రికెటర్‌గా, కెప్టెన్‌గా సక్సెస్‌ఫుల్ కెరీర్‌ను లీడ్ చేశారు. ఉమెన్స్ వన్ డే ఇంటర్‌నేషనల్ క్రికెట్ ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా జులన్ రికార్డు సాధించారు.



అనుష్కా శర్మ

● యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ సైతం క్రికెట్ బ్యాట్ పట్టారు. 'మిస్టర్ అండ్ మిస్ట్రస్ మహి' సినిమాలో జాన్వీ కపూర్ క్రికెటర్‌గా నటిస్తున్నారు. రాజ్‌కుమార్ రావ్ మరో లీడ్ రోల్ చేస్తున్నారు. శరణ్ శర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. రియల్ క్రికెటర్స్ దగ్గర శిక్షణ తీసుకుని జాన్వీ కపూర్ ఈ సినిమా చేశారు. వీరితోపాటు మరికొందరు క్రికెటర్ల బయోపిక్‌లు, క్రికెట్ ఆధారంగా సినిమాలకు చర్చలు జరుగుతున్నాయి.



జాన్వీ కపూర్

టైమ్‌లెస్ లవ్!

హీరో నాగచైతన్య–డైరెక్టర్ వెంకట్ ప్రభు కాంబినేషన్‌లో రూపొందుతున్న తెలుగు–తమిళ చిత్రం 'కస్టడీ'. కృతీ శెట్టి కథానాయిక. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ సినిమా మే 12న రిలీజ్ కానుంది. ఇళయరాజా, ఆయన కుమారుడు యువన్‌శంకర్ రాజా స్వరపరచిన ఈ చిత్రంలోని 'టైమ్‌లెస్ లవ్.' అంటూ సాగే పాటని రేపు (ఆదివారం) రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, పోస్టర్ రిలీజ్ చేశారు. ''భారీ నిర్మాణ విలువలు, సాంకేతిక ప్రమాణాలతో 'కస్టడీ' తెరకెక్కుతోంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సమర్పణ: పవన్ కుమార్, కెమెరా: ఎస్ఆర్ కదిర్.



నాగచైతన్య, కృతీ శెట్టి

వీళ్లందరూ మిస్ అవలేదు..

'నిన్న రాత్రి నుంచి మా నాన్న కనిపించడం లేదు సార్', 'రెండు వారాల నుంచి మా అబ్బాయి కనిపించడం లేదు సార్' అనే డైలాగులతో 'ఉగ్రం' సినిమా ట్రైలర్ విడుదలైంది. 'నాంది' వంటి హిట్ తర్వాత హీరో 'అల్లరి' నరేశ్, డైరెక్టర్ విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'ఉగ్రం'. మిర్నా మీనన్ కథానాయికగా నటించారు. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించిన ఈ చిత్రం మే 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం ట్రైలర్ విడుదల చేశారు. 'వీళ్లందరూ మిస్ అవలేదు.. మిస్ చేయబడ్డారు. అందులో నా భార్య, కూతురు కూడా ఉన్నారు ('అల్లరి' నరేశ్), 'చీకట్లో జరిగే వ్యాపారం.. చీకట్లోనే వదిలెయ్. (విలన్ పాత్రధారి)' వంటి డైలాగులు ట్రైలర్ ఉన్నాయి. ''యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'ఉగ్రం'. నరేశ్ పాత్రను విజయ్ కనకమేడల ఇంటెన్స్‌గా చూపించారు. 'నాంది'లా 'ఉగ్రం' కూడా మంచి హిట్ అవుతుంది'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి కెమెరా: సిధ్, సంగీతం: శ్రీచరణ్ పాకాల.



'అల్లరి' నరేశ్

వినోదాత్మకంగా...

'బలగం' ఫేమ్ సుధాకర్ రెడ్డి, అంజి వల్గమాన్ ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'భీమదేవరపల్లి బ్రాంచి'. రమేష్ చెప్పాల దర్శకత్వంలో డా. బత్తిని కీర్తిలత గౌడ్, రాజా నరేందర్ చెట్లపెల్లి నిర్మించిన ఈ చిత్రంలో రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్, సీబీఐ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, సీనియర్ నేత అద్దంకి దయాకర్ కీలక పాత్రలు పోషించారు. త్వరలో ఈ చిత్రం విడుదల కానుంది. బత్తిని కీర్తిలత మాట్లాడుతూ– ''ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ ద్వారా ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ మధ్య ప్రివ్యూ షో చూసిన సినీ, రాజకీయ ప్రముఖులు బాగుందని అభినందించారు. ఇటీవల రిలీజ్ చేసిన ఈ చిత్రంలోని 'ఎల్లమ్మ..' పాట అందర్నీ ఆకట్టుకుంటోంది. మంచి కథను కామెడీగా చెప్పడంతో ప్రేక్షకులకు మా సినిమా రీచ్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.



సుధాకర్ రెడ్డి

వాస్తవ ఘటన ఆధారంగా....



రాజీవ్ కనకాల

అనిరుధ్, యశస్విని జంటగా, రాజీవ్ కనకాల, జీవా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'యాద్గిరి అండ్ సన్స్'. భిక్షపతి రాజు పందిరి దర్శకత్వంలో చంద్రకళ పందిరి నిర్మించిన ఈ చిత్రం మే 5న రిలీజ్ కానుంది. భిక్షపతి రాజు మాట్లాడుతూ– ''వాస్తవ ఘటన స్ఫూర్తితో రూపొందిన చిత్రం ఇది. ఈ చిత్రంలోని పాత్రలన్నీ సహజంగా ఉంటాయి. సీనియర్ నటులు జీవా, రాజీవ్ కనకాల నటన హైలైట్‌గా ఉంటుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి'' అన్నారు.

చూపు తిప్పిందేంటి?

'తెలుగు ఇండస్ట్రీ కన్నడపై చూపు తిప్పిందేంటి?' అనే డైలాగ్‌తో 'మళ్ళీ పెళ్లి' సినిమా టీజర్ విడుదలైంది. వీకే నరేష్, పవిత్రా లోకేష్ జోడీగా నటిస్తున్న ఈ చిత్రానికి ఎంఎస్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. విజయకృష్ణ మూవీస్ బ్యానర్‌పై వీకే నరేష్ నిర్మిస్తున్నారు. తెలుగులో 'మళ్ళీ పెళ్లి', కన్నడలో 'మత్తే మధువే' పేరుతో రూపొందుతోన్న ఈ చిత్రం టీజర్‌ని శుక్రవారం విడుదల చేశారు. 'అతను భార్యని ఎలా చూసుకోవాలో, భార్య విలువేంటి? అని తెలియని ఒక మృగం' (వనితా విజయ్ కుమార్), 'చుట్టూ అప్పులు, ఒంటినిండా రోగాలు పెట్టుకున్న నీతో సరసం ఏంటి?' (వీకే నరేశ్) వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ''ఆసక్తికరమైన కథలను ఎంచుకుంటున్న ఎంఎస్ రాజు మరో విభిన్న కథాంశంతో తెరకెక్కిస్తున్న చిత్రం 'మళ్ళీ పెళ్లి'. ఈ వేసవిలో తెలుగు, కన్నడ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నాం'' అని యూనిట్ పేర్కొంది. జయసుధ, శరత్ బాబు, అనన్య నాగళ్ల, రోషన్, రవివర్మ, అన్నపూర్ణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, నేపథ్య సంగీతం: అరుల్ దేవ్, కెమెరా: ఎంఎన్ బాల్ రెడ్డి.



పవిత్ర, నరేశ్

డాక్టర్ రేణు

వెంకటేశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్. వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రంలో డాక్టర్ రేణు పాత్రలో హీరోయిన్ రుహానీ శర్మ నటిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించి, ఆమె లుక్ రిలీజ్ చేశారు. 'చిలసౌ, హిట్: ది ఫస్ట్ కేస్, డర్టీ హరి, నూటొక్క జిల్లాల అందగాడు' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించారు రుహానీ శర్మ. 'శైలేష్ కొలను దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'హిట్: ది ఫస్ట్ కేస్'లో హీరోయిన్‌గా నటించారు రుహానీ. ఇప్పుడు మరోసారి ఆయన దర్శకత్వంలో 'సైంధవ్'లో డాక్టర్ రేణుగా కీలక పాత్ర పోషిస్తున్నారు. బాలీవుడ్ యాక్టర్ నవాజుద్దీన్ సిద్ధిఖీని ఈ చిత్రంతో తెలుగుకి పరిచయం చేస్తున్నాం. ప్రస్తుతం 'సైంధవ్' షూటింగ్ వైజాగ్‌లో జరుగుతోంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణ్, కెమెరా: ఎస్. మణికందన్.



రుహానీ శర్మ